# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత్ - బోట్స్వానా దేశాల భాగస్వామ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల భూటాన్ పర్యటన విజయవంతంగా ముగిసింది.

❖ ప్రపంచ మార్కెట్ లో గిరిజన ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

❖ భారత్, మారిషస్ దేశాల మధ్య పరస్పర సహకారం ఉండాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆకాంక్షించారు.

========================

భారత్ -బోట్స్వానా భాగస్వామ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బోట్స్వానా జాతీయ అసెంబ్లీలో పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి ఈ రోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా జాతీయ అసెంబ్లీని ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. బోట్స్వానా ప్రజలకు 140 కోట్ల భారతీయుల తరఫున శుభాకాంక్షలను తెలియజేశారు. బోట్స్వానా సుపరిపాలన సమ్మిళిత అభివృద్ధికి ఒక మంచి ఉదాహరణగా పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపార సహకారాన్ని మరింత పెంచాలని రాష్ట్రపతి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల భూటాన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భూటాన్ రాజు జిగ్మే సింగ్యే వాంగ్చుక్ తో కలిసి కాలచక్ర సాధికారత వేడుకను ఈ రోజు ప్రారంభించారు. అంతకుముందు, ఇద్దరు నాయకులు ప్రాంతీయ ప్రపంచ అంశాలపై చర్చించారు. దక్షిణాసియాలో

రెండు పొరుగు దేశాలైన భారత్, భూటాన్ ల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఎన్నో సంవత్సరాలుగా భూటాన్ పాలకులు చేస్తున్న ప్రయత్నాలను ప్రధానమంత్రి అభినందించారు. ఇంధనం, వాణిజ్యం, సాంకేతికత, సహకారం వంటి విషయాలపైన కూడా భారత్, భూటాన్ దేశాల మధ్య భాగస్వామ్యం గురించి చర్చించారు. అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ టోబ్‌గేతో కూడా సమావేశమయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, మారిషస్ దేశాల మధ్య మత్స్య సంపద, సముద్ర సాంకేతికత వంటి రంగాలలో పరస్పర సహకారం ఉండాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... సముద్ర వనరుల నిర్వహణ సముద్ర ఆధారిత అంశాలకు సంబంధించిన సాంకేతికత విషయంలో భారతదేశానికి ఉన్న అపార అనుభవం మారిషస్ తో కలసి పని చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. సముద్ర ఆధారిత కార్యకలాపాల ద్వారా స్థిరమైన ఆర్థిక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చుకోవడంతో పాటు  సముద్ర పరిశోధనకు అవసరమయ్యే ప్రాజెక్టులను రూపొందించే విషయంలో ఇరు దేశాల భాగస్వామ్యం ఉండాలని కోరారు. భారతదేశ భూ శాస్త్ర సంస్థలు సముద్ర ఆధారిత ఆర్థిక అభివృద్ధి కోసం కార్యాచరణను తయారు చేయడమే కాకుండా మారిషస్ తో కలిసి పని చేస్తాయని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ మార్కెట్‌లో గిరిజన ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన గిరిజన వాణిజ్య సమావేశం 2025ను ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడుతూ.... గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎగుమతి సామర్థ్యం ఉన్న అన్ని గిరిజన ఉత్పత్తులకు వాణిజ్య శాఖ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలకు  ఈ-కామర్స్ వేదికలను వారధిగా చేసుకోవాలని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు రెండూ కూడా గిరిజన ఉత్పత్తులకు అపారమైన అవకాశాలను అందిస్తున్నాయని పీయూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన్ జాతీయ గౌరవ్ వర్ష్ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో చోటు చేసుకున్న కారు పేలుడు ఘటనలో గాయపడిన వారిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పరామర్శించారు. భూటాన్ పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న అనంతరం స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రికి ప్రధానమంత్రి వెళ్లారు. గాయపడిన వారితో మాట్లాడి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రుల ప్రస్తుత పరిస్థితిని వైద్యులు ప్రధానికి వివరించారు. బాధితులను పరామర్శించిన దృశ్యాలను ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ.. దాడి వెనుక ఉన్నవారిని చట్టం ముందు నిలబెడతామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాగాలాండ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఇమ్ కాంగ్ ఎల్. ఇమ్చెన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. నాగాలాండ్ అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని సామాజిక మాధ్యమం ద్వారా ప్రధాని కొనియాడారు. శాసనసభ్యునిగా  అనేక సంవత్సరాలుగా ప్రజా జీవితంలో చురుగ్గా పని చేశారని తెలిపారు. గిరిజన వర్గాల సంక్షేమం పట్ల మక్కువ చూపారని ప్రధానమంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యుద్ధ భూమిలో సైతం సాంకేతికత అవసరం పెరుగుతోందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవులకు సహకారంగా ఉండడానికి ఉపయోగించాలని చెప్పారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఢిల్లీ డిఫెన్స్ డైలాగ్ 2025లో ఆయన ప్రసంగిస్తూ... ఆపరేషన్ సిందూర్ కోసం ఉపయోగించిన సెక్యూర్ ఆర్మీ మొబైల్ భారత్ వెర్షన్ (SAMBHAV) ఇప్పుడు రెండవ దశకు చేరుకుందని వివరించారు. రానున్న కాలంలో ఇది అధునాతన వెర్షన్ అవుతుందని ద్వివేది తెలియజేశారు. భారత సైన్యం మానవ - కేంద్రీకృత సాంకేతికతను పరిశీలిస్తోందని వెల్లడించారు. యుద్ధ భూమిలోని గ్రే జోన్‌లలో AI, రోబోటిక్స్ సైబర్ సాధనాలను ఉపయోగించాలని కూడా ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఈ నెల 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటల 30 నిమిషాలకు వాయు మార్గం ద్వారా ఉప రాష్ట్రపతి విశాఖపట్నం చేరుకుంటారు. స్థానిక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అదే రోజున ఉదయం 11 గంటల 15 నిమిషాలకు బయలుదేరి ఐఎన్ఎస్ డేగ చేరుకొని అక్కడ నుండి ఢిల్లీకి తిరిగి బయలుదేరి వెళతారు. ఈ మేరకు ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 871 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 595 పాయింట్ల లాభంతో 84 వేల 466 వద్ద ముగిసింది. నిఫ్టీ 180 పాయింట్ల లాభంతో 25 వేల 875 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 64 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.60 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 123 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో రెండు రోజుల పాటు జరిగిన కార్మిక ఉపాధి పరిశ్రమల శాఖ మంత్రులు, రాష్ట్రాల కేంద్రపాలిత ప్రాంతాల కార్యదర్శుల జాతీయ సమావేశం ఈ రోజుతో ముగిసింది. ఈ సమావేశాన్ని ఈ నెల 11న కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, క్రీడలు - యువజన వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. భారతదేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా మరింత సమగ్రమైన, చురుకైన కార్మిక శక్తిని పెంపొందించేకు వినూత్న చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అనేక పంట రకాలు పోషకాహారం పర్యావరణ సమతుల్యతకు చాలా కీలకమైనవని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

========================